సాక్షి
ప్రకాశం

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



రైతులకు అండగా ప్రభుత్వం

రైతుల అవసరాలను గుర్తించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. - 8లో..



వృద్ధురాలి దారుణ హత్య

వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఘటన యర్రగొండపాలెం మండలం రాళ్లవాగు సమీపంలో వెలుగుచూసింది - 8లో..

గరిష్టం/కనిష్టం
34/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేడు కొండపిలో నూతన ఆస్పత్రి భవన ప్రారంభోత్సవం

● ముఖ్య అతిథిగా మంత్రి సురేష్

కొండపి(టంగుటూరు): కొండపి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరికట్ల కోటిలింగం, మండల జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ



పాములపాడులో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలక్రిష్ణ

పొదిలిరూరల్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరు చేసిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలక్రిష్ణ సిబ్బందిని ఆదేశించారు. పొదిలి మండలంలోని పాములపాడు సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది అడ్డంకిగా ఉన్న పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాలకు నెట్ సౌకర్యం లేకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. సెల్ సిగ్నల్ కూడా సక్రమంగా రావడం తెలిపారు. పాములపాడు ఎస్సీ కాలనీకు చెందిన తోటకూర లక్ష్మీప్రసన్న, తోటకూర పెద్దక్క, తోటకూర మరియమ్మ, తోటకూర గురవమ్మకు చెందిన ఇళ్ల పట్టాలను రెండు రోజుల నుంచి చేస్తున్నా ఇంత వరకు కాలేదని జేసీకి చెప్పారు. జేసీ లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో స్థలం మంజూరుతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. ఇళ్లను రిజిస్ట్రేషన్ చేస్తే వారికి పూర్తి హక్కులు కలుగుతాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి పట్టా పొందిన ప్రతి ఒక్కరూ కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ మహమ్మద్ జియాఉల్‌హక్, వీఆర్‌ఓలు రహీమ్, కిలారి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ తిరుపతి, శేషగిరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ఏకేయూలో వార్షిక సమావేశాలు

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 42వ వార్షిక సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు ఏకేయూ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. తొలిరోజు సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏకేయూ సెమినార్ హాలులో వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి ప్రారంభిస్తారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి శాసన పరిశోధకులు తమ పరిశోధన పత్రాలు సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. వీరితో పాటు ఇంకా వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఈ ఆటోలు, రహదారి భద్రతపై అవగాహన సదస్సు

ఒంగోలు: రహదారి భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని గురువారం స్థానిక రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో ఈ ఆటో రిక్షాలు, రహదారి భద్రత అనే అంశంపై ఆటో డ్రైవర్లు, ఆటో మొబైల్ షోరూం డీలర్లకు రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఆటో రిక్షాల వల్ల వాటి యజమానులకు కలిగే ప్రయోజనాలు, పర్యావరణానికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వాహనాలను నడిపేటప్పుడు ప్రమాదాలకు కారణమైన విషయాలపై, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు కిరణ్‌ప్రభాకర్, సురేంద్ర ప్రసాద్, సహాయ మోటార్ తనిఖీ అధికారులు జయప్రకాష్, కె.రవినాయక్, తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు.

ఊపిరి పోద్దాం

అప్పటి వరకూ ఉల్లాసంగా మాట్లాడుతూ అకస్మాత్తుగా కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. నడుస్తూ కొందరు... జిమ్‌లో వ్యాయమం చేస్తూ మరికొందరు గుండెపోటుతో కుప్పకూలుతున్నారు. ఇదంతా కళ్ల ముందే జరిగిపోతోంది. కోవిడ్ తరువాత ఇలాంటి సంఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గుండెపోటు బాధితులు పెరిగిపోతూ ఉన్నారు. వీటి సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. మెడికల్, పారామెడికల్ విద్యార్థులకు బేసిక్ కార్డియో పల్మనరీ లైఫ్ సపోర్ట్ (బీసీఎల్ఎస్) కోర్సును కచ్చితంగా పూర్తి చేయాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. ఈ శిక్షణ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ ఉంటేనే కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. లేకపోతే లేదు. దీంతో జిల్లాలోని అన్నీ నర్సింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులకు ఒంగోలులోని సర్వజన ఆసుపత్రిలో బీసీఎల్ఎస్‌లో శిక్షణ ఇస్తున్నారు.



- లైఫ్ సపోర్ట్‌లో శిక్షణ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- జీసీఎల్ఎస్ సర్టిఫికెట్ ఉంటేనే కౌన్సిల్ రిజిస్ట్రేషన్
- మెడికల్, పారామెడికల్ విద్యార్థులందరికీ జీజీహెచ్‌లో శిక్షణ
- ఇంటింటికీ సీపీఆర్ పేరుతో రెడ్‌క్రాస్ కార్యక్రమాలు
- రోజురోజుకూ పెరిగిపోతున్న గుండెజబ్బులు
- పెరుగుతున్న బాధితులు

ఒంగోలు టౌన్: కోవిడ్ తరువాత గుండెజబ్బులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. హార్ట్ అటాక్‌తో జీజీహెచ్‌కు వచ్చే వారి సంఖ్య పెరిగిపోతుంది. కనిగిరి, సీఎస్‌పురం, టంగుటూరు, మద్దిపాడు, చీమకుర్తి, బేస్తవారిపేట, కంభం, మార్కాపురం, దోర్నాల తదితర ప్రాంతాల నుంచి గుండెపోటు కేసులు ఎక్కువగా ఒంగోలు జీజీహెచ్‌కు వస్తున్నాయి. గత ఏడాది జనవరి 1వ తేది నుంచి డిసెంబర్ 31 వరకు 538 మంది గుండె నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చారు. వీరిలో పురుషులు 332 మంది ఉండగా 206 మంది మహిళలు ఉన్నారు. చికిత్స పొందుతూ 70 మంది మరణించారు. గత ఏడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది 25 వరకు 90 మంది గుండెపోటుతో చికిత్స కోసం రాగా వారిలో ఒకరు మరణిచంచారు. ఫిబ్రవరిలో ఇప్పటి వరకు 29 మందిని జీజీహెచ్‌కు తరలించగా వారిలో ఒకరు మరణించారు. ఈ వారంలో సరాసరిన రోజుకు 4 గుండెపోటుతో వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి కేసులు ఎక్కువగా నమోదవుతుండడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. మెడికల్, పారామెడికల్ విద్యార్థులకు బేసిక్ కార్డియో పల్మనరీ లైఫ్ సపోర్ట్ (బీసీఎల్ఎస్) కోర్సును కచ్చితంగా పూర్తి చేయాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. దీనికి ఒంగోలు రిమ్స్‌లో అనస్థీషియా విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రాజసుందరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీనికి జిల్లాలోని 40కి పైగా ఉన్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు హాజరవుతున్నారు. 30 మంది చొప్పున బ్యాచ్‌లను తయారు చేసి శిక్షణ ఇస్తున్నారు. అలాగే జిల్లాలోని 42 మంది సీహెచ్‌ఓలకు కూడా శిక్షణ ఇస్తున్నారు. నర్సింగ్ విద్యార్థుల శిక్షణ పూర్తికాగానే హౌస్ సర్జన్లకు కూడా బీసీఎల్ఎస్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. దీని వల్ల గుండెపోటుతో పాటుగా కరెంటు షాక్, నీటిలో మునిగిపోవడం లాంటి ప్రమాదకరమైన పరిస్థితులలో కొనప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారికి అత్యవసర చికిత్స చేయడం ద్వారా ప్రాణాలు కాపాడేందుకు అవకాశాలు మెరుగవుతాయి.

సీపీఆర్ ఎప్పుడు చేయాలి...

ఆగిపోయిన గుండె, ఊపిరితిత్తులను మళ్లీ పనిచేసేలా చేయించి మెదడుకు రక్త సరఫరాను పునరుద్ధరించడాన్నే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) అంటారు. గుండె ఆగిపోయిన 10 నిముషాల లోపు దీన్ని చేస్తే బాధితుడు ప్రాణాలతో బయటపడేందుకు అవకాశాలు మెరుగవుతాయి. అంతకంటే అలస్యంగా సీపీఆర్ చేస్తే ఒకవేళ ప్రాణాలతో బయట పడినా సకాలంలో మెదుడుకు రక్త సరఫరా జరగకపోవడంతో మెదడు కణాలు దెబ్బతిని పక్షవాతం బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎవరైనా ఒక వ్యక్తి గుండెనొప్పితో కానీ మరేదైనా ఇతరా కారణం వల్ల కానీ స్పృహ తప్పి పడిపోతే వీలైనంత త్వరగా సీపీఆర్ చేయడం మంచిది. అందుకే ప్రతి ఒక్కరికీ సీపీఆర్ గురించి అవగాహన కలిగి ఉండాలని చెబుతున్నారు కార్డియాలజిస్టులు. ఎవరైనా ఒక వ్యక్తి గుండెపోటుతో పడిపోయినప్పుడు అతడి ఎదరురొమ్ము భాగంలో జిఫిస్టెర్నమ్‌కు రెండు అంగుళాల పైన సీపీఆర్ చేయాల్సి ఉంటుంది. కుడిచేతి మీద ఎడమ చేతిని ఉంచి లాక్ చేసుకోవాలి. మోచేతిని వంచకుండా మన బరువునంతటినీ ఉపయోగించి 2 నుంచి 3 సెంటీమీటర్లు కిందకు ఒత్తాలి. ఇలా బరువును ప్రయోగించినప్పుడు గుండె కండరాలలో పెరిగే ఒత్తిడితో గుండె కవాటాలు తెరుచుకుంటాయి. దాంతో రక్త నాళంలోనికి ఒక్కసారిగా రక్తప్రసరణ ఎక్కువ అవుతుంది. అలా నిలుపకుండా సీపీఆర్ చేయడం వల్ల రక్త నాళంలోకి చిమ్మిన రక్తం గుండె, మెదడుతో పాటుగా శరీరం మొత్తం ప్రవహిస్తుంది. అలాగే బాధితుడి ముక్కుమూసి అతడి నోటిలో మన నోటిని ఉంచి ఉధృతంగా గాలిని ఊదాలి. అలా గాలిని పంపించడం వల్ల రక్తంలో ఆక్సిజన్ లెవెల్స్ పెరుగుతాయి. అప్పుడు బాధితుడి ప్రాణాలు నిలుస్తాయి.

మేము సైతం అంటున్న రెడ్‌క్రాస్...

రెడ్‌క్రాస్ మహిళా విభాగం కూడా మేము సైతం అంటూ సీపీఆర్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ సీపీఆర్ పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మహిళా సభ్యులు నగరంలోని అపార్ట్‌మెంట్ల వద్దకు వెళ్లి అందులో నివాసముంటున్న వారికి ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే రెడ్ క్రాస్ మహిళా విభాగం సభ్యులు సుమారు 1000 మందికి శిక్షణ ఇచ్చినట్టు ఆ సంస్థ జిల్లా చైర్మన్ ప్రకాష్ తెలిపారు. అలాగే గత నెల 11 ,12 తేదీల్లో జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో 200 మందికి, పోలీసు ట్రయినింగ్ కళాశాలలో 50 మందికి శిక్షణ ఇచ్చారు. పాత్రికేయులకు కూడా రెడ్‌క్రాస్ శిక్షణ ఇచ్చారు. ఒంగోలు నగరంతో పాటుగా జిల్లా వ్యాప్తంగా సీపీఆర్ శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించినట్లు రెడ్‌క్రాస్ తెలిపారు.



నర్సింగ్ విద్యార్థులకు సీపీఆర్‌లో శిక్షణ ఇస్తున్న వైద్యులు

అన్నీ పాఠశాలల్లో సీపీఆర్ శిక్షణ ఇవ్వాలి



మెడికల్, పారామెడికల్ విద్యార్థులందరికీ బేసిక్ కార్డియోపల్మనరీ లైఫ్ సపోర్ట్‌లో శిక్షణను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచి నిర్ణయం. అలాగే హైస్కూలు స్థాయి నుంచే ప్రతి ఒక్క విద్యార్థికి శిక్షణ ఇస్తే బాగుంటుంది. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం సులువవుతుంది. రెడ్‌క్రాస్ తరఫున మేం చేపట్టిన ఇంటింటికీ సీపీఆర్ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నాం.

– డాక్టర్ షేక్ మజ్నూ, రెడ్‌క్రాస్ మహిళా విభాగం కో కన్వీనర్

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



గుండె జబ్బులు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి. దీని వలన ఎవరికైనా ఇబ్బంది తలెత్తినప్పుడు ఆసుపత్రికి వెళ్లి చికిత్స అందించేలోపే గుండె కవాటాలు దెబ్బతినకుండా చేయవచ్చు. ఒక్కో సందర్భంలో ప్రాణాలను సైతం కాపాడినవాళ్లవుతారు. తొలి 10 నిముషాలలోపు బాధితుడికి అందించిన వైద్య చికిత్సే అతడి పాలిట వరమవుతుంది.

– డాక్టర్ జాగర్లమూడి కృష్ణ, రెడ్‌క్రాస్ ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్

కొన ఊపిరిలో ఉన్న వ్యక్తికి ప్రాణాలు పోయవచ్చు



గుండెపోటు వచ్చినా, కరెంటు షాకుకు గురైనా గుండె ఆగిపోవడం జరుగుతుంది. ఇలాంటి వ్యక్తులు స్పృహ కోల్పోతారు. ఇది ఒక్కో సమయంలో ప్రాణాలను బలిగొంటుంది. ఇలాంటి వారికి సీపీఆర్ చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. సీపీఆర్ చేయడం వలన 50 శాతం ప్రాణాలను కాపాడే ఆవకాశం ఉంటుంది. అత్యవసర సమయంలో అందించే ఈ సీపీఆర్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. శిక్షణ పొంది ఉంటే ఇంకా మంచిది.

– డాక్టర్ కుంచాల వెంకటేశ్వరరావు, కార్డియాలజిస్టు, జీజీహెచ్

బాధ్యతలు చేపట్టిన వెంటనే..

- బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ
- నూతన డీఈఓ సుభద్రను కలసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈఓ సుభద్ర



జగనన్న గోరుముద్దపై హెడ్మాస్టర్‌ను ప్రశ్నిస్తున్న డీఈఓ

ఒంగోలు: జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులైన డి.సుభద్ర గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కొద్ది సేపటికే ఆమె నగరంలోని బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సంచలనం సృష్టించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. డీఈఓగా సుభద్ర బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె నగరంలోని బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. 9వ తరగతిలో సగం మంది విద్యార్థులు ట్యాబ్‌లు తీసుకురాకపోవడం, తెచ్చిన విద్యార్థులు కూడా వాటిని వినియోగించలేకపోతుండడాన్ని గమనించారు. 10వ తరగతిలో పదో తరగతి విద్యార్థులతో పాటు 3వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉండడంపై మండిపడ్డారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం ఏమిటంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక జగనన్న గోరుముద్దలో 450 మందికి కోడిగుడ్లు అందించేందుకు సిద్ధం చేయగా పులిహోర మాత్రం కేవలం 5 కేజీలు మాత్రమే ఉండడం ఏంటని ప్రశ్నించారు. ఇంటివద్ద భోజనం కాదని, పాఠశాలలో భోజనం చిన్నారులు తినేలా చేయాలని, ఆ విధంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, 9వ తరగతి, 10వ తరగతి టీచర్లను సంజాయిషీ కోరగా వారం లోగా అన్ని లోపాలను సిరిదిద్దుకుంటామని వారు విజ్ఞప్తి చేశారు. అన్ని పాఠశాలల్లో ట్యాబుల వినియోగం తప్పనిసరిగా ఉడాలని , ప్రతి విద్యార్థి మధ్యాహ్నభోజనం తినేటట్లుగా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పదో తరగతి విద్యార్థులతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించడం, సీ, డీ గ్రేడ్ సాధించిన విద్యార్థుల్లో ఉత్తీర్ణత సాధించేందుకు తగు చర్యలు చేపట్టాలని జిల్లాలోని అన్ని పాఠశాలల హెడ్మాస్టర్లను డీఈఓ డి.సుభద్ర ఆదేశించారు. ఇదిలా ఉండగా నూతన డీఈఓను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, సమగ్రశిక్ష కార్యాలయం అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టిగుంట మహేశ్వరరావు, రమణారెడ్డి కలిసి వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ డైరీని అందించారు. హెడ్మాస్టర్స్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు డి.కాంతారావు, కార్యదర్శి వై.వెంకట్రావుతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు కలిసి విధి నిర్వహణలో తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

అభ్యంతరాలు పరిశీలించి పరిష్కరిస్తాం

● కలెక్టర్ దినేష్‌కుమార్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై రాతపూర్వకంగా వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రకాశం భవనంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకుని పొరపాట్లను సరిచేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫారం–7 దరఖాస్తులు 0.1శాతం కంటే ఎక్కువ వస్తే ఆయా ఓట్లను తొలగించాలంటే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా బేగ్, స్వరూప్, రసూల్, సత్యనారాయణ, ఎర్రయ్య, సుదర్శన్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

● కేజీబీవీ స్టేట్ సెక్రటరీ మధుసూధన్‌రావు



సమావేశం నిర్వహిస్తున్న స్టేట్ సెక్రటరీ మధుసూదన్‌రావు

ఒంగోలు అర్బన్: కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ప్రిన్సిపాళ్లు చిత్తశుద్ధితో కృషి చేయాలని స్టేట్ కేజీబీవీ సెక్రటరీ డి.మధుసూధన్‌రావు అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం ప్రకాశంభవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతితో పాటు ఇంటర్మీయెట్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణులయ్యేలా బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పది ర్యాంకుల్లో కేజీబీవీ విద్యార్థులు ఉండేలా చూడాలన్నారు.

పదో తరగతిలో 500 మార్కులపైగా వచ్చేలా ప్రణాళికాబద్ధంగా చదివించాలన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ ఎం ప్రమోద, ఏపీఓ సీహెచ్ మాధవిలత, బాపట్ల జీసీడీఓ చారులత తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు రిజస్ట్రేషన్ తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సహాయక కార్మిక శాఖాధికారులు

ఒంగోలు టౌన్: వ్యాపారులంతా దుకాణాలు, వ్యాపార సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ కె. దుర్గా భవానీ అన్నారు. బాపూజీ కాంప్లెక్స్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం కిరాణా మర్చంట్స్, ప్రొవిజనల్స్ అసోసియేషన్, ది రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్, ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్, బీడి సిగరెట్ మర్చంట్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1088 గురించి వివరించారు. చట్టం నిబంధనల ప్రకారం ప్రతి ఒక్క వ్యాపారి విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. సదస్సులో సహాయ కార్మిక అధికారులు ఎం వెంకటేశ్వర్లు, ఎలిజబెతమ్మ, అసోసియేషన్ నాయకులు బీఎంసీ కమిటీ చైర్మన్ కోడూరి సత్యనారాయణ, ఎస్ఆర్‌యంఎస్ శ్రీనివాసరావు, వరద రాజం, టి.పుల్లయ్య, పి.రమేష్, ఎ.రాజు, రాధాకృష్ణ, కె.ప్రసాద్, బియ్యపు వెంకట సుబ్బారావు, కూరపాటి సత్యనారాయణ, అద్దంకి శ్రీనివాసులు, బి.శ్రీనివాసరావు, పువ్వాడ యానాది, యం.శ్రీనివాసరావు, యం.తిరుపాల్, ఎస్. ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక స్పందన

కురిచేడు: స్థానిక గుంటక నాసరరెడ్డి కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక స్పందన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులంతా హాజరవుతారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

నేడు గుర్రం జాషువా కాంస్య విగ్రహావిష్కరణ

ఒంగోలు అర్బన్: ప్రకాశంభవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా కాంస్య విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఆవిష్కరించనున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి మంత్రితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, నగర మేయర్, డీవీఎంసీ సభ్యులు, గుర్రం జాషువా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, దళిత, గిరిజన సంఘాలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

క్లుప్తంగా

మండలిలో ఎయిడెడ్ సమస్యల ప్రస్తావనపై హర్షం

ఒంగోలు: శాసనమండలిలో ఎంఎల్‌సీ కల్పలతా రెడ్డి గురువారం ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించడంతో ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి గురువారం హర్షం వ్యక్తం చేశారు. 1998 నుంచి మెడికల్ రీయింబర్స్‌మెంట్, 2000 సంవత్సరం నుంచి కారుణ్య నియామకాలు లేవని, దీనివల్ల ఎయిడెడ్ ఉపాధ్యాయ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. 2008 నుంచి నేటివరకు ఆరోగ్య కార్డులు లేక కరోనా సమయంలో 169 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు మరణించారని, తమ చిరకాల కోరిక అయిన కారుణ్య నియామకాలు, ఆరోగ్య కార్డుల అంశాన్ని శాసనమండలిలో ప్రస్తావించడాన్ని స్వాగతిస్తున్నామంటూ హర్షం వ్యక్తంచేశారు.

నవోదయ ప్రవేశ పరీక్ష రేపు

ఒంగోలు: నవోదయలో ఖాళీగా ఉన్న 9, 11 విద్యా సంవత్సరాల్లో ప్రవేశాలకు ఈనెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, విద్యార్థులు తమ హాల్‌టికెట్లను పొంది కేటాయించిన పరీక్ష కేంద్రంలో హాజరుకావాలన్నారు. ఒంగోలులో డీఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల, రాంనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపికచేసినట్లు పేర్కొన్నారు.

రైజ్‌లో ఉన్నత విద్యావిధానాలపై అవగాహన సదస్సు



అవగాహన కలిగిస్తున్న కె.రామమోహన్‌రావు

ఒంగోలు: స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యావిధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర క్వాలిటీ ఎష్యూరెన్స్ సెల్ డైరెక్టర్ కె.రామమోహన్‌రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హయ్యర్ ఎడ్యుకేషన్ సమష్టిగా అందించిన పథకాల వల్ల విద్యార్థిగా తాము పొందిన విద్యా సౌకర్యాల గురించి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని తమ కాలేజీలో నిర్వహించినందుకు కాలేజీ కార్యదర్శి శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు, హయ్యర్ ఎడ్యుకేషన్ అధికారులకు అభినందనలు తెలిపారు.

రైతులకు అండగా ప్రభుత్వం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ



కాటా దగ్గర తూకాన్ని పరిశీలిస్తున్న జేసీ, అధికారులు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ
- పాములపాడులో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పొదిలి రూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వారి అవసరాలను గుర్తించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం పొదిలి మండలం పాములపాడు పంచాయతీ గొల్లపల్లి సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా జేసీకి అధికారులు, రైతులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కంది పంట అత్యధికంగా ప్రకాశం జిల్లాలోనే పండుతోందన్నారు. జిల్లాలో అత్యధికంగా పొదిలి మండలంలో 20,188 ఎకరాల్లో కంది పంట సాగవుతోందని, ఈ నేపథ్యంలో మొదటి కొనుగోలు కేంద్రాన్ని ఇక్కడే ప్రారంభించామన్నారు. త్వరలోనే జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సీడ్ టు సేల్ ద్వారా కందుల కొనుగోలుకు ఆసక్తి చూపుతోందన్నారు. రైతుల వద్ద నాణ్యమైన కందులను ప్రభుత్వం కొనుగోలు చేసి, సివిల్ సప్లయ్ ద్వారా వాటిని కంది పప్పు రూపంలో ప్రజలకు పంపిణీ చేస్తోందని వివరించారు. తద్వారా ప్రజలకు, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు.

మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు

కంది పంటకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.7,500గా నిర్ణయించిందన్నారు. అయితే రైతులు కందులు విక్రయించే నాటికి మార్కెట్‌లో ఎంత ధర ఉంటే ఆ ధర చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం క్వింటాకు రూ.10,295 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. సంచులు నింపడానికి అయ్యే కూలీల ఖర్చు, రవాణా ఖర్చులు తిరిగి రైతులకు చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కందులను ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. తేమ శాతం 12, వ్యర్థాలు 2 శాతం, దెబ్బతిన్న గింజలు, ఇతర పప్పు గింజలు 3 శాతం వరకు ఉండవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ధరల్లో వ్యత్యాసం వచ్చినపుడు రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గోడౌన్లను నిర్మించిందని తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ ఉదయ్ భాస్కర్, సివిల్ సప్లయిస్ డీఎం సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, డీసీఓ పోలిశెట్టి రాజశేఖర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కందుల వెంకటేశ్వర్లు, బీవీఎస్ శాస్త్రి, ఏడీఏ బాలాజీనాయక్, తహసీల్దార్ మహమ్మద్ జియా ఉల్ హక్, వ్యవసాయాధికారి జైనులాబ్దిన్, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, సీఈఓ సుధాకర్‌రెడ్డి, పేరం కోదండరామిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ మల్లాపురం నరసింహులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

- పింఛను నగదు కోసం ఘాతుకం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



హత్యకు గురైన చెన్నమ్మ(ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

యర్రగొండపాలెం: వృద్ధురాలిని దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ఈడ్చుకెళ్లి పడేసిన ఘటన యర్రగొండపాలెం మండలం రాళ్లవాగు సమీపంలో గురువారం వెలుగుచూసింది. వివరాలు.. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన తూమాటి చెన్నమ్మ(77) బుధవారం కాలనీ సమీపంలో సమాధుల వద్దకు బహిర్భూమికి వెళ్లింది. అక్కడి నుంచి ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆచూకీ కోసం బంధువులు తీవ్రంగా గాలించినా కనిపించలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం కూడా వారు గాలిస్తున్న సమయంలో ఓవర్‌హెడ్ ట్యాంకు పక్కన ఉన్న పిచ్చి మొక్కల పొదల్లో చెన్నమ్మ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలంలో ఆమెను ఈడ్చుకొని వెళ్లిన ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. ఆమె తలపై రాళ్లతో మోది హతమార్చినట్లు తెలుస్తోంది. ఆమె వద్ద ఉన్న డబ్బు కోసం మందుబాబులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ప్రతి నెల చెన్నమ్మ తీసుకునే పింఛను డబ్బు ఆమె వద్దే ఉంటాయని, ప్రస్తుతం రూ.5 వేలు ఉన్నట్లు కుమారుడు వెంకటేశ్వర్లు తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు నీళ్ల ట్యాంకు వద్ద మద్యం సేవిస్తున్న సమయంలో ఆమె ఆ ప్రాంతానికి వెళ్లగా హత్య చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. వృద్ధురాలి హత్య వెలుగుచూసిన వెంటనే మార్కాపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు ముమ్మరం చేశారు. డాగ్ స్క్వాడ్ అంబేడ్కర్ నగర్, మెయిన్ రోడ్డులో ఎక్కువగా సంచరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ వెంట ట్రైనీ డీఎస్పీ షెహవాజ్ అహ్మద్, యర్రగొండపాలెం, మార్కాపురం సీఐలు కె.రాములు నాయక్, ఆవుల వెంకటేశ్వర్లు, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు బి.సుదర్శన్, అంకమరావు, ఫాతిమా బేగం, క్లూస్ టీం ఏఎస్సై మహమ్మద్ ఇబ్రహీం ఉన్నారు.

మాయమాటల మాంత్రికుడు బాబు

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- యాత్ర 2 సినిమా కాదు.. జగన్ మోహన్‌రెడ్డి వీర పోరాట చరిత్ర
- పసుపుగల్లు, చింతలపూడి గ్రామాల్లో మన ఊరికి.. మన శివన్న ఎన్నికల ప్రచారం



పసుపుగల్లులో ప్రజలకు అభివాదం చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు



బూచేపల్లి కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ముండ్లమూరు: మాయమాటల మాంత్రికుడు నారా చంద్రబాబును నమ్మి ప్రజలు మోసపోవద్దని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని పసుపుగల్లులో గురువారం రాత్రి మన ఊరికి మన శివన్న ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా స్థానిక ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బూచేపల్లి కుటుంబ సభ్యులు వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, నందినిలకు అడుగడుగునా మహిళలు పూల వర్షం కురిపిస్తూ ప్రచారంలో వెన్నంటి నిలిచారు. ప్రచార రథంపై వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ జెండా అండగా ఉంటుందన్నారు. మీ చిరునవ్వుల్లో జగనన్న అభిమానం కనిపిస్తుందన్నారు. పేద, నిరుపేదల అభ్యున్నతి కోసం పాటుపడే దేశంలోనే దమ్మున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. జగనన్న మాట ఇస్తే అది శిలాశాసనమేనని తెలిపారు. సామాజిక న్యాయం కోసం పోరాడే జగనన్న అందుకు నిదర్శనంగా విజయవాడ నడి బొడ్డున ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 215 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి దళితుల, బీసీల పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు. నవరత్నాల నగదు మహిళల బ్యాంకు ఖాతలకు జమ కావాలంటే జగనన్న మరలా సీఎం కావాలన్నారు. మన ఊరు మన శివన్న, మన పసుపుగల్లు కార్యక్రమంలో తన బిడ్డ శివప్రసాదరెడ్డి, జగనన్న ఆశీస్సులతో మరో సారి మీ ముందుకు వస్తున్నాడని గెలిపించాలని వెంకాయమ్మ కోరారు. దర్శిలో శివప్రసాద రెడ్డి గెలిస్తే.. జగనన్న ముఖ్యమంత్రి అయినట్లేనన్నారు. పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నేడు జగనన్న రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతు భరోసా, పంటల బీమాతో లక్షల రూపాయలు నేరుగా రైతు ఖాతాల్లో జమచేసి వారికి అండగా నిలిచారన్నారు. చంద్రబాబుకు తెలిసిన ఏకైక విద్య వెన్నుపోటు మాత్రమేనన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని మాట్లాడిన చంద్రబాబు నేడు వారి ఓట్ల కోసం మాయమాటలతో మీ ముందుకు వస్తే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. డ్వాక్రా రుణ మాఫీ హామీకి తూట్లు పొడిచిన చంద్రబాబును మహిళలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. ఎస్సీ కాలనీకి చెందిన వరగాని నాగేశ్వరరావు కుమారుడు నాగరాజు ప్రమాదంలో గాయపడగా అతనిని పరామర్శించారు. ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ఎంపీపీ బంకా రమణమ్మనాగిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాస రెడ్డి, మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, జిల్లా యూత్ కార్యదర్శి గర్నెపూడి ప్రసన్నకుమార్, ఉపసర్పంచ్ బిజ్జం జ్యోతికృష్ణారెడ్డి, నాయకులు మారం శ్రీనివాసరెడ్డి, అంజిరెడ్డి, బిజ్జం రమణారెడ్డి, బాలకోటిరెడ్డి, జాన్, దాసరి ఎలీషా, దామా శ్రీను, గూడాల లింగారెడ్డి, వరగాని అబ్రహం, మేకల వెంకటేశ్వరరెడ్డి, కైపు వెంకటేశ్వరరెడ్డి, మదార్‌వలి, మేదరమెట్ల కోదండరామయ్య, అంజిరెడ్డి, కొండా రెడ్డి, మండలపు అశోక్, భిక్షాలు రెడ్డి, మేడగం రమణారెడ్డి, గొంది వెంకటప్పారెడ్డి, పాలడుగు చిరంజీవి, కావూరి రామయ్య, తాతపూడి దేవయ్య, మాజీ ఎంపీటీసీ పాలెపోగు వీరయ్య, గోపనబోయిన వెంకటేశ్వర్లు, మహిళలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారంలోగా నీటి బిల్లుల విడుదల

- తాగునీటి ట్యాంకర్ల పునరుద్ధరణకు అనుమతి
- వైపాలెం నియోజకవర్గ సమస్యలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీనియర్ ఐఏఎస్‌లు ధనుంజయరెడ్డి, భరత్‌గుప్తాను కలిసిన తాటిపర్తి



ఎమ్మెల్యే బాలినేనితో కలిసి మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులు వారం రోజుల్లో విడుదల అవుతాయని, రెండు రోజుల్లో నీటి ట్యాంకర్లను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టామని వైఎస్సార్ సీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి నియోజకవర్గంలో సమస్యలను రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీనియర్ ఐఏఎస్‌లు ధనుంజయరెడ్డి, భరత్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, బోర్లు, డ్రైనేజీ ఏర్పాటు సమయంలో ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారన్న విషయాన్ని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన మంత్రి అటవీ శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో సమస్య పరిష్కారమైందన్నారు. తీగలేరు-5 కెనాల్ భూ సేకరణ సర్వేకు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నామని, నియోజకవర్గంలోని 5 మండలాల్లో చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, వైద్యశాలలు, వెలిగొండ పునరావాస కేంద్రాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల విషయమై ఐఏఎస్ ధనుంజయరెడ్డితో మాట్లాడగా అప్రూవల్‌కు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పట్టాల పంపిణీ, పుల్లలచెరువు మండలంలోని యర్రబాలెం గ్రామ ఉపాధ్యాయ పోస్టు టెక్నికల్ సమస్య వల్ల నిలిచిపోవడం, అటవీ శాఖాధికారుల ఇబ్బందులు, నీటి బిల్లుల పరిష్కారంపై కలెక్టర్ దినేష్‌కుమార్‌తోనూ చర్చించినట్లు తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి నియోజకవర్గంలో పరిస్థితులపై చర్చించినట్లు పేర్కొన్నారు.

యువత ఉన్నతంగా స్థిరపడాలి

- జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి
- థాట్‌వర్క్స్ కంపెనీలో ఉద్యోగం సాధించిన మౌనికకు సన్మానం



మౌనికను అభినందిస్తున్న రవీంద్రరెడ్డి, ఏసుప్రసాద్‌రావు

ఈతముక్కల(కొత్తపట్నం): ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని యువత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి ఆకాంక్షించారు. థాట్ వర్క్స్ టెక్నాలజీస్(ఎంఎన్‌సీ) సంస్థలో ఉద్యోగం సాధించిన ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని మౌనికను అభినందించారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కాలేజీలో చదువుకున్న వారంతా జీవితంలో స్థిరపడ్డారని చెప్పారు. థాట్ వర్క్స్ టెక్నాలజీస్ భారత్‌లో నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌లో దేశం మొత్తం మీద 80 మంది ఎంపికవగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 35 మందికి అవకాశం దక్కిందని, వారిలో పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు 19 మంది ఉండగా.. ఈతముక్కల కాలేజీ నుంచి మౌనిక సెలెక్ట్ కావడం గర్వకారణమన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించినా.. చదువుతో పేదరికాన్ని జయించవచ్చని నిరూపించిన మౌనికను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి చొరవతో థాట్ వర్క్స్ టెక్నాలజీస్ సంస్థ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులను సైతం ఎంట్రన్స్ టెస్ట్‌కు అనుమతించడం హర్షణీయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఏసుప్రసాద్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాంశాలకే కాకుండా స్కిల్స్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మౌనికలాగా ప్రతి ఒక్కరూ మంచి కంపెనీల్లో ఉద్యోగం సంపాదించాలని ఆకాంక్షించారు. మౌనికను కాలేజీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, కంప్యూటర్స్ హెచ్ఓడీ విజయ్‌వర్ధన్, నీరజ్, కృష్ణయ్య, వెంకటకృష్ణ, సుధాకర్, భాగ్యారావు, ఎలీషా, సీహెచ్ సునీత తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై మరో మూడు క్రిమినల్ కేసులు

పొదిలి: ఒంగోలుకు చెందిన న్యాయవాది ఎం.కృష్ణారావుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై రంగయ్య తెలిపారు. పొదిలి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, మర్రిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసుకు సంబంధించిన నిందితులకు జామీన్ ఇప్పించేందుకు పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాది తప్పుడు ఆస్తి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాడు. ఈ విషయమై కోర్టు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. పొదిలి పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణారావుపై మొత్తం ఐదు క్రిమినల్ కేసులు నమోదైనట్లు వివరించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తి నష్టం

కొండపి(టంగుటూరు): పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బ్యారన్ దగ్ధమైన సంఘటన కొండపి మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రైతు సూర్యనారాయణ తన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్న సమయంలో అల్లుడుకర్ర జారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.